
సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పిల్లల పరిరక్షణకు పాటుపడాలి: కలెక్టర్

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ స్మైల్‌లో గుర్తించిన పిల్లల పరిరక్షణకు పాటుపడాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కన్వర్జెన్స్ ఆన్ ఆపరేషన్ స్మైల్ 11వ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, పిల్లల హక్కులు, చట్టాలపై నిరంతరం అవగాహన కల్పిస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్ల వెంట భిక్షాటన చేస్తున్న పిల్లలు, బాల కార్మికులు, వీధి బాలలకు మంచి విద్యనందించాలన్నారు. హాట్‌స్పాట్ ఏరియాల్లో తనిఖీలు చేపట్టి రోడ్డుపై తిరిగే పిల్లలను గుర్తించాలని, వారి ఆధార్, ఇతర డాక్యుమెంట్లు సేకరించాలన్నారు. జిల్లాను 28 జోన్లుగా విభజించి ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ ద్వారా పిల్లల రక్షణకు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ శైలజ, డీసీపీ లావణ్య, ఐసీడీఎస్ పీడీ అక్కేశ్వర్‌రావు, జిల్లా కార్మికశాఖ అధికారి జాన్సన్, హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ పెండింగ్ కేసులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అట్రాసిటీ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, భూ సమస్యలపై కమిషన్ సభ్యులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ, అట్రాసిటీ కేసులపై నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నష్టపరిహారం రూ.2.48 కోట్లు ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 1216 అట్రాసిటీ, 4 ల్యాండ్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నెలలోగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల నాయకులు పలు సమస్యలపై కమిషన్‌కు వివరించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీసీపీ శ్వేత, కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, కురసం, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాంప్రసాద్, ఎల్లేష్, సుదర్శన్ బాబు, గోపి, డీఆర్‌ఓ వెంకటాచారి, సోషల్ వెల్ఫేర్ డీడీ కోటాజీ, ఆర్డీఓలు సాయిరాం, రామకృష్ణ, ఏసీపీలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న హిమాచల్‌ప్రదేశ్ మంత్రి రాజేష్ ధర్మాని

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

● హిమాచల్ ప్రదేశ్ మంత్రి రాజేష్ ధర్మాని

బంజారాహిల్స్,జనవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని, నైపుణ్యాలను పెంచుకున్న వారికి మంచి భవిష్యత్ ఉంటుందని హిమాచల్ ప్రదేశ్ సాంకేతిక విద్య, వృత్తి విద్య, పారిశ్రామిక శిక్షణా శాఖ మంత్రి రాజేష్ ధర్మాని అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) సంయుక్తంగా శుక్ర వారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమానికి ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా, ఉపాధి రంగంలో నైపుణ్యాభివృద్ధి అనేది ఎంతో కీలకమైనదని, విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు శోధనా సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎడ్యుకేషనల్ టూర్ లో భాగంగా హిమాచల్‌ప్రదేశ్‌ను సందర్శించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ వీడియో ఆధారంగా దర్యాప్తు చేయాలి

పంజాగుట్ట,జనవరి17(ఆంధ్రజ్యోతి): తన భార్య ఆత్మహత్య చేసుకునే ముందు విడుదల చేసిన సెల్ఫీ వీడియో, లేఖ ఆధారంగా బాధ్యులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు జరపాలని సీనియర్ పాత్రికేయుడు ఏ.ప్రభు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన తన కుమార్తె స్పందనతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తన భార్య దుర్గా మాధవి ఆమె తల్లిదండ్రులు, సోదరుడితో ఉన్న ఆర్థికపరమైన అంశాల నేపథ్యంలో తలెత్తిన మానసిక ఒత్తిడితో సూసైడ్ సెల్ఫీ వీడియోను తీసుకొని, లేఖ రాసి పెట్టి ఈ నెల 2న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. జనవరి 3న దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోగా, మాదాపూర్ పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా భావించి ఆసుపత్రికి తరలించారన్నారు. 4వ తేదీన పోలీసులు సమాచారం ఇవ్వగా తాము ఆసుపత్రికి వెళ్లి చూడగా ఆ మృతదేహం తన భార్య దుర్గామాధవి దిగా గుర్తించామని ప్రభు తెలిపారు.

బ్యాడ్మింటన్ పైనే ఫోకస్

● వరల్డ్ మాజీ నెంబర్ వన్ కిడాంబి శ్రీకాంత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కెరీర్‌లో మళ్లీ అత్యుత్తమ దశకు చేరుకునేందుకు కృషి చేస్తున్నానని భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ చెప్పాడు. శుక్రవారం ప్రముఖ బ్యాడ్మింటన్ ఉత్పత్తుల సంస్థ 'హండ్రెడ్' కిడాంబిను తమ ప్రచారకర్తగా నియమించుకుంది. ఈ సందర్భంగా కిడాంబి మాట్లాడుతూ, తిరిగి వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్‌ను అందుకునేందుకు ప్రయత్నిస్తానని తెలిపాడు. ప్రస్తుతం తనకు బ్యాడ్మింటన్‌పై తప్ప మరో ధ్యాస లేదన్నాడు. అనంతరం హండ్రెడ్ సంస్థ ప్రతినిధి విశాల్‌తో కలిసి జెర్సీను ఆవిష్కరించాడు.



జెర్సీని ఆవిష్కరిస్తున్న కిడాంబి శ్రీకాంత్

జిమ్నాస్టిక్ విజేత ప్రిషా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): రాష్ట్ర ఎస్‌జీఎఫ్ జిమ్నాస్టిక్స్ పోటీల్లో ప్రిషా స్వర్ణ పతకం సాధించింది. గాడియం స్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో బాలికల అండర్-14 ఆల్‌రౌండ్ విభాగంలో ప్రిషా 43.3 పాయింట్లతో టాప్‌లో నిలవగా, అంజన 41.9 పాయింట్లతో ద్వితీయ, సహస్రా 41.3 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచింది. అంతర్జాతీయ జిమ్నాస్టిక్ కోచ్ అలికజో వీరికి పతకాలు ప్రదానం చేసింది.


పతకాలతో క్రీడాకారులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి17(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 నుంచి ఉదయం 10.30 గంటల వరకు 11 కేవీ స్టడీ సర్కిల్ ఫీడర్ పరిధిలో, ఉదయం 10 నుంచి ఉద యం 11 గంటల వరకు 11 కేవీ శిల్పారామం ఫీడర్ పరిధిలో, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ క్యాన్సర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో, ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

● పచ్చదనంతో కల్యాణ్‌నగర్ వెంచర్-3 కాలనీ పార్కులు

● రెండు వైపులా వాకింగ్ ట్రాక్‌లు ● చిన్నపిల్లల కోసం ఆటవస్తువులు


పార్కులోని ఓపెన్‌జిమ్

ఎర్రగడ్డ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరం నానాటికీ కాంక్రీట్ జంగిల్‌గా మారుతోంది. ఫలితంగా పచ్చదనం కరువై ఒకవైపు కాలు ష్యం పెరిగిపోతుండగా, మరోవైపు జనానికి ఆహ్లాదం కరువవుతోంది. అయితే, దీనికి భిన్నంగా ఎర్రగడ్డ డివిజన్‌లోని కల్యాణ్‌నగర్ వెంచర్-3 కాలనీలోని పార్కులు మాత్రం పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. సుమారు అర కిలో మీటర్‌కు పైగా పొడవు ఉన్న ఈ పార్కులు ప్రారంభం మొదలు కొని చివరి వరకు పూర్తిగా చెట్లు, మొక్కలతో నిండి ఉంటాయి. దీంతో డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీలకు చెందిన వారు ఇక్కడికి వచ్చి ఆనందంగా గడపడంతో పాటు వాకింగ్ చేసి ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

కాలనీ సంక్షేమ సంఘం కృషితో...

కల్యాణ్‌నగర్ వెంచర్-3 కాలనీ సంక్షేమ సంఘం పార్కుల్లో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు పార్కులు మొత్తం మొక్కలు నాటి పచ్చదనం పెంచేందుకు ఎంతో కృషి చేస్తోంది. పార్కుల్లో రెండు వైపులా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లు వాకింగ్ చేసేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటున్నాయి. ఓపెన్ జిమ్‌తో పాటు చిన్న పిల్లలకు ఆట వస్తువులు కూడా అందుబాటులో ఉండడంతో సాయంత్రం వేళల్లో కుటుంబంతో సహా చిన్నారులు, పెద్దవారు వచ్చి ఆటపాటలతో గడుపుతుంటారు.

అన్ని సౌకర్యాలతో రెండు పార్కులు

ఇక్కడ రెండు పార్కులు ఉండగా.. కాలనీ ప్రారంభంలో ఉన్న పార్కుకు కల్యాణ్‌నగర్ వెంచర్-3 లైబ్రరీ పార్కు అని, కాలనీ చివరలో ఉన్న పార్కుకు కల్యాణ్‌నగర్ వెంచర్-3 ఫెస్టివల్ పార్కు అని పేర్లు పెట్టారు. లైబ్రరీ పార్కులో కాలనీవాసుల కోసం దినపత్రికలతో పాటు విజ్ఞానాన్ని పెంచే వివిధ రకాల పుస్తకాలు, నవలలు, కవితలు కూడా అందుబాటులో ఉంటాయి. ఇక్కడ కొత్తగా కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నారు. వచ్చే మార్చిలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఈ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించనున్నారు.

ఇక ఫెస్టివల్ పార్కు విషయానికి వస్తే ఇది కూడా దాదాపు అర కిలోమీటర్ పైగానే ఉంటుంది. ఈ పార్కులోనూ పచ్చదనంతో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ వినాయక చవితి, దసరా తదితర ఉత్సవాలు,ఇతర పండుగలను నిర్వహించడం వల్ల ఈ పార్కును ఫెస్టివల్ పార్కు అని పిలుస్తారు.


పార్కులోని పచ్చదనం

ఆహ్లాదకరమైన వాతావరణం



కల్యాణ్‌నగర్ వెంచర్-3లోని రెండు పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ప్రతి రోజూ ఇక్కడ వాకింగ్ చేస్తాను. మొక్కలు, చెట్లు ఉండటం వల్ల వ్యాయామం చేసేవారికి, వాకర్స్‌కు తగినంత ఆక్సిజన్ లభిస్తోంది. దీంతో వాకింగ్ చేస్తుంటే అలసట అనిపించదు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం వల్ల చుట్టు పక్కల కాలనీలు, బస్తీల నుంచి పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు.

- జి.మాణిక్‌రెడ్డి, వాకర్, అవంతినగర్

ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది



పార్కుల్లో ప్రస్తుతం సందర్శకులకు ఆహ్లాదంగా ఉండేందుకు వివిధ రకాల సౌకర్యాలను కల్పించాం. పార్కులను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాం. గ్రీనరీని పెంచడానికి కొన్నిచోట్ల ఎర్త్ ఫిల్లింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. పార్కులో అతి పెద్ద వాకింగ్ ట్రాక్ ఉంది. పది రౌండ్లు వాకింగ్ చేస్తే పది కిలోమీటర్లు తిరిగినంత అనుభూతి కలుగుతుంది.

- నాగళ్ల నరసింహారావు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు

రహదారి ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

● 'రీల్స్' కోసం బైక్స్‌పై విన్యాసాలు చేయొద్దు: ఏసీపీ

పంజాగుట్ట, జనవరి17(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ కోసం స్పోర్ట్స్ బైక్స్, ఇతర ద్విచక్రవాహనాలపై విన్యాసాలు చేయడం ఎంతో ప్రమాదకరమని, బైక్స్‌పై విన్యాసాలు చేస్తూ ప్రాణాలు పోగొట్టుకోవద్దని బేగంపేట ట్రాఫిక్ శిక్షణ కేంద్రం(టీటీఐ) ఏసీపీ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో విద్యార్థులకు 'రోడ్డు ప్రమాదాలు, నివారణ' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అతివేగం అంతిమ ప్రయాణం అవుతుందని, రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని అన్నారు. సామాజిక మాధ్యమాలు, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసి లైక్స్ కోసం యువత స్పోర్ట్స్ బైక్స్‌పై విన్యాసాలు చేస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమన్నారు. అతి వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ 281తో పాటు 177 ఎంవీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలి, వాహనం వెనుక కూర్చున్న వారు కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. బేగంపేట టీటీఐ ఇన్స్పెక్టర్ వి.రాంచందర్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేని 2385 మందికి బేగంపేట టీటీఐలో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్, ఎస్ఐ భూమేశ్వర్,కళాశాల ప్రతినిధులు డాక్టర్ సునీత సింగం, విజయ కుమారి, హీరో మోటోకార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ సాదిక్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.



సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బేగంపేట టీటీఐ ఏసీపీ ఎన్.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

● ఏసీపీ ఎర్నా నాయక్

ఖైరతాబాద్,జనవరి17(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వారితో పాటు తల్లిదండ్రులపై చర్యలుంటాయని సెంట్రల్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎర్నా నాయక్ హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, లైసెన్స్‌లు లేనివారు తప్పనిసరిగా తీసుకోవాలని, అది లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు లైసెన్సులు లేకుండా వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ఇందులో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, ఎస్ఐ రజాక్ తదితరులు పాల్గొన్నారు.



లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న సెంట్రల్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎర్నా నాయక్, అధికారులు

ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో అవినీతిపై విచారణ చేయాలి

● కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఆరోపణ

పంజాగుట్ట,జనవరి17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పేరుతో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై తాను ఏసీబీకి ఫిర్యాదు చేశానని, ముఖ్యమంత్రితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేత బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే రేవంత్ రెడ్డి అక్రమాలకు బీజం వేశారని ఆరోపించారు. ఇందులో భాగంగానే మెగా కృష్ణారెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల నుంచి పార్టీ ఫండ్‌గా కోట్లాది రూపాయలు ఇప్పించారని అన్నారు. వీటన్నింటికీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు ఒకరు కారకుడని జడ్సన్ ఆరోపించారు. తనతో పాటు రాష్ట్రంలో 45 మంది ముఖ్యమైన ప్రజాప్రతినిధులు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ అవు తున్నాయని, వారిలో కాంగ్రెస్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నారన్నారు.

ధోబీ అని సంబోధించకుండా చూడాలి

● బీసీ కమిషన్‌కు విన్నవించిన రజక మహిళా సంఘం

ఖైరతాబాద్,జనవరి17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రజకులను ఆ పేరుతో పాటు చాకలి, మడేల్ అని మాత్రమే సంబోధించాలని, వాటిని మాత్రమే ప్రభుత్వ గెజిట్‌లో చేర్చి ధోబీ అనే పదాన్ని కుల నామంగా పరిగణించకుండా చూడాలని కోరుతూ బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు తెలంగాణ రజక మహిళా సంఘం విన్నవించింది. శుక్రవారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు మల్లేశ్వరపు రాజేశ్వరి నాయకత్వంలో మహిళలు కమిషన్ ఎదుట తమ వాదనలను వినిపించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో బహిరంగంగా హరిజన, ధోబి అనే పదాలను వాడరాదంటూ ఇచ్చిన తీర్పుతో పాటు పలు న్యాయస్థానాల తీర్పు ప్రతులను కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో పాటు సభ్యులకు అందించారు. తాము కమిషన్‌కు ఈనెల 8వ తేదీన ధోబీ పదం వద్దు.. రజక ముద్దు అనే నినాదంతో వచ్చి కమిషన్‌కు ధోబీ పదం తొలగించాలని వినతి పత్రం సమర్పించగా దీనిపై శుక్రవారం వాదనలు వినిపించామని రాజేశ్వరి తెలిపారు. తెలంగాణలో వన్నార్ పదానికి పర్యాయంగా మండేల్ కుల నామాన్ని మాత్రమే చేర్చాలని, దోబీ పదం వాడకుండా చూడాలని తమ వాదనలు వినిపించారు.

ఆకాష్ ఇనిస్టిట్యూట్‌లో అగ్ని ప్రమాదం

● కాలిపోయిన కంప్యూటర్లు, ఫర్నిచర్

బంజారాహిల్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆకాష్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. షేక్‌పేట పరిధి హుమా కాలనీలోని డ్యూక్ అవెన్యూ అపార్ట్‌మెంట్ 2వ అంతస్తులో కానసాగుతున్న ఆకాష్ ఇనిస్టిట్యూట్ నుంచి శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా దట్టమైన పొగ, మంటలు వచ్చాయి. స్థానికులు ఫిలింనగర్‌లోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా.. రెండు వాహనాలు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఏ మాత్రం ఆలస్యమైన మంటలు రిలయన్స్ ట్రెండ్జ్‌కు వ్యాపించి ఉండేవి. ప్రమాదంలో కంప్యూటర్లు, ఫర్నిచర్ దగ్ధమైంది. ఫిలింనగర్ పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదస్థలిని పరిశీలించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): షేక్‌పేటలో అగ్ని ప్రమాదం జరిగిన డ్యూక్స్ ఎవెన్యూ భవనాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం పరిశీలించారు. అగ్ని ప్రమాదాలకు కారణాలను అడిగి తెల్సుకున్నారు. భవనంలోని రెండో అంతస్తులో 7500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆకాశ్ ఇనిస్టిట్యూట్ మొత్తం అగ్నికి ఆహుతి కాగా.. ఆ ప్రాంతాన్ని సందర్శించారు. సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు పరిశీలించాలని రంగనాథ్ డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తం చేసే అధునాతన వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని భవన యజమానులకు చెప్పారు. ఫైర్, డీఆర్‌ఎఫ్ బృందాలు సకాలంలో స్పందించడం వల్ల ప్రమాద తీవ్రత తగ్గిందని రంగనాథ్ అభిప్రాయపడ్డారు.


అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

బంజారాహిల్స్‌లో విలువైన స్థలం ఆక్రమణకు యత్నం

● కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఖరీదైన తమ స్థలాన్ని రౌడీల సాయంతో ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... రోడ్ నెంబర్ 14 లోని విష్ణు నివాస్‌లో నివాసముంటున్న వ్యాపారి విమల్ కుమార్ సింగ్ కు షేక్ పేట మండలం సర్వే నంబర్ 219, 220 (న్యూ), 391(ఓల్డ్) లోని టీఎస్ నంబర్ 4 లోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్ నంబర్ 5లో మౌంట్ మేరు అపార్ట్‌మెంట్ పక్కన 1300 గజాల స్థలం ఉంది. 2012లో రెండవ అదనపు చీఫ్ జడ్జి ఇచ్చిన డిక్రీ ఆధారంగా స్థలం యజమానులైన సయ్యద్ ఇబ్రహీం హసన్ కాజ్మీ అలియాస్ అస్లాం కాజ్మీ వద్ద నుంచి ఈ స్థలాన్ని 2013లో ఆయన కొనుగోలు చేశారు. అనంతరం తన భార్య సునీతా సింగ్ పేరుతో జీపీఏ చేశారు. అప్పటి నుంచి స్థలం వారి ఆధీనంలో ఉంది. కాగా ఈ స్థలంలోని 611 గజాలు తమదంటూ కెనడాలో ఉండే షకీర్ పేరుతో కొంతమంది స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. విమల్ కుమార్ గతంలో షకీర్‌తో పాటు అతడి అనుచరులపై నగర పోలీస్ కమిషనర్‌కు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కబ్జాదారులు వెనక్కి తగ్గారు. ఇదిలాఉండగా, శుక్రవారం తెల్లవారుజామున స్థానికంగా నివాసం ఉంటున్న అక్బర్ అనే వ్యక్తితో పాటు సుమారు 15 మంది స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి గేటు బిగించి స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిన్నారంటూ స్థల యజమాని విమల్ కుమార్ సింగ్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ స్థలం వద్దకు చేరుకోగా కొంతమంది పారిపోయారు. పనులు చేసేందుకు వచ్చిన నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నకిలీ పత్రాలతో స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న షకీర్, అక్బర్‌లతోపాటు ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ విమల్ కుమార్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలో వేషం ఇప్పిస్తానని లైంగిక దాడి: కేసు నమోదు

బంజారా హిల్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సినిమాలో నటించే అవకాశం కల్పిస్తానని సినిమా పరిశ్రమ డైరెక్షన్ విభాగంలో పనిచేసే ఒక వ్యక్తి మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వివాహితకు భర్తతో విభేదాలు రావడంతో అతడి నుంచి విడిపోయి మణికొండలో హౌస్ కీపింగ్ పని చేస్తోంది. సినిమాలో నటిస్తే ఆర్థికంగా స్థిరపడవచ్చని భావించింది. ఈ నేపథ్యంలో 15 రోజుల క్రితం అమీర్‌పేటలోని ఓ హాస్టల్ చేరి సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా అవకాశం కోసం మూడు రోజులుగా కృష్ణానగర్, ఇందిరానగర్ పరిసరాల్లో తిరుగుతోంది. ఈ క్రమంలో ఆమెకు సినీ పరిశ్రమలో డైరెక్షన్ విభాగంలో పని చేస్తున్న కాటేకొండ రాజుతో పరిచయం ఏర్పడింది. మూడు రోజుల క్రితం ఆడిషన్స్ ఉన్నాయంటూ కృష్ణానగర్‌లోని హెవెన్ హోటల్‌కు ఆమెను పిలిచాడు. మొదటి రోజు ఫొటోషూట్ చేసి మరుసటి రోజు రావాలని చెప్పాడు. రెండో రోజు గదికి వెళ్లగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బీఎన్ఎస్ 64,79,115,351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

బంజారాహిల్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 4లో నివాసముండే డి. మోసెస్(20) ప్రైవేటు ఉద్యోగి. ప్రతి రోజూ విధులు ముగించుకొని ఇంటికి వచ్చాక మొదటి అంతస్తులో ఉన్న తన గదికి వెళ్లి అక్కడే భోజనం చేసేవాడు. ఈ నెల 16న అతని తల్లి భోజనం తీసుకొని వచ్చింది. గదిలో మోసెస్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. కుటుంబ సభ్యులతో కలిసి కిందకు దించి చూడగా అప్పటికే మరణించాడు. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ర్యాపిడో డ్రైవర్‌కు మస్కా కొట్టి .. బైక్, మొబైల్ ఫోన్‌తో పరారీ

బంజారాహిల్స్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ర్యాపిడో డ్రైవర్‌కు మస్కా కొట్టి బైక్, మొబైల్ ఫోన్‌తో పరారయ్యాడో కేటుగాడు. సరూర్‌నగర్‌కు చెందిన మంత్రి హరిప్రసాద్ ర్యాపిడో డ్రైవర్. ఈ నెల 16న ఓ ప్రయాణికుడిని సరూర్‌నగర్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తీసుకువెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కనిపించిన ఓ అపరిచితుడు తనను షేక్‌పేటలో దించాలని హరిప్రసాద్‌ను అడిగాడు. దీంతో అతడిని జూబ్లీహిల్స్ వరకు తీసుకొచ్చాడు. ఇదిలా ఉండగా, ఆ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని నడుపుతానని అడగడంతో హరిప్రసాద్ అతడికి ఇచ్చాడు. షేక్‌పేటకు వెళ్లాక అడ్రస్సు అడిగి రమ్మని హరిప్రసాద్‌ను పంపించాడు. అనంతరం అపరిచితుడు అతడి ద్విచక్ర వాహనంతో పాటు వాహనానికి ఉన్న మొబైల్ ఫోన్‌తో ఉడాయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ బంగారం విక్రయానికి యత్నించిన వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని ఓ వ్యాపారి పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. టోలిచౌకికి చెందిన అబ్దుల్లా ఇబ్రహీం వ్యాపారి. ఈ నెల 6 వ తేదీన ఇనాముల్ హసన్ అనే వ్యక్తి ఫోన్ చేసి తాను 8 కిలోల బంగారు ఇస్తానని, రెండు కోట్ల రూపాయలు కావాలని అడిగాడు. దీనికి ఇబ్రహీం ఒప్పుకోలేదు. మరికొద్ది రోజులకు ఆ వ్యక్తి ఫోన్ చేసి కిలో బంగారం తీసుకొని హైదరాబాద్‌కు వచ్చానని చెప్పాడు. దీంతో అనుమానం వచ్చిన ఇబ్రహీం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశా డు. ఇదిలా ఉండగా, ఈ నెల 16న హసన్ ఫోన్ చేసి తన వద్ద రెండు బంగారు కడియాలు ఉన్నాయని చెప్పాడు. ఇబ్రహీం అతడిని కలిసి కడియాలు పరిశీలించగా, నకిలీవని తేలింది. దీంతో హసన్‌ను మాటల్లో పెట్టి ఫిలింనగర్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజ నర్సింహాకు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేస్తున్న గాంధీ ఆస్పత్రి జూడా వైద్యులు

మంత్రి గారూ.. మా డిమాండ్లు పరిష్కరించరూ

అడ్డగుట్ట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గాంధీ ఆస్పత్రి జూనియర్ వైద్యుల సంఘం ప్రతినిధులు, వైద్యులు వంశీ, కొమ్ము రాహల్, ఇసాక్ న్యూటోన్, అంకెం అశీష్, శేషం దీపాంకర్, అజయ్ కుమార్ శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహా నివాసానికి వెళ్లి ఆయనకు వినతి సమర్పించారు. స్కాలర్ షిప్ రీయింబర్స్‌మెంట్ అండర్ గ్రాడ్యుయేట్ స్కాలర్ షిప్‌లకు ప్రభుత్వం చెల్లించడంలేదని వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. జూడాల సమస్యలు విన్న మంత్రి సానుకూలంగా స్పందించారు. తమ వినతి పత్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శికి వెంటనే పంపించాలని జూడాలు కోరారు.

మార్కెట్‌లోకి పాలీ క్యాబ్ సుప్రీమా వైర్లు



పాలీ క్యాబ్ సుప్రీమా వైర్లను ప్రారంభిస్తున్న నక్క యాదగిరి

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అధునాతన ఎలక్ట్రానిక్ బీమ్ టెక్నాలజీతో రూపొందించిన పాలి క్యాబ్ సుప్రీమా వైర్లను తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల సమాఖ్య అధ్యక్షుడు నక్క యాదగిరి ప్రారంభించారు. రాణిగంజ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలీక్యాబ్ సంస్థ అధికారులు ఉద్యోగులతో కలిసి పాల్గొన్నారు. పాలీక్యాబ్ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ నవీన్ శామ్యూల్ మాట్లాడుతూ, తాము కొత్త టెక్నాలజీతో రూపొందించిన వైర్లు ఎండాకాలం వేడితోపాటు కరెంట్ హెచ్చు తగ్గుల సమయంలో అత్యధిక వేడిమిని తట్టుకుంటాయని తెలిపారు. గృహాలతోపాటు వ్యవసాయ ఆధారిత మోటార్లకు కూడా ఈ వైర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీతోపాటు పాలీక్యాబ్ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి

సృజనాత్మకతను వెలికి తీయడానికే ముగ్గుల పోటీలు

రాంగోపాల్‌పేట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మహిళల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికే ఈ ముగ్గుల పోటీలని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. శుక్రవారం చీర సుచిత్ర అధ్వర్యంలో పీజీ రోడ్డు వెంకట్రావ్‌నగర్ కాలనీ అసోసియేషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలో 54 మంది మహిళలు పాల్గొనగా అందులో మొదటి స్థానంలో నిలిచిన భాగ్యలక్ష్మీకి క్రాంప్టన్ మిక్సర్ గ్రైండర్‌ను రెండవ స్థానంలో నిలిచిన ప్రసన్న కుమారికి బజాజ్ సిలికాన్ స్లైస్ రోస్టర్, మూడవ స్థానంలో నిలిచిన దాయినికి పెషర్ కుక్కర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన అటల్ బిహారీ ఫౌండేషన్ అధ్యక్షురాలు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి వారికి బహుమతులను అందజేశారు.



బొల్లారంలో మహిళలతో గాయకుడు ఏపూరి సోమన్న

ప్రభుత్వం వెంటనే వర్గీకరణ చేయాలి : ఏపూరి

తిరుమలగిరి జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరీ 7న ఎంఆర్‌పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరగబోయే వేల గొంతులు.. లక్ష డప్పులు దండోరా సాంస్కృతిక మహా ప్రదర్శన విజయవంతానికై మహిళలు, మాదిగ సామాజిక వర్గాలు పెద్ద ఎత్తున తరలి రావాలని గాయకుడు ఏపూరి సోమన్న పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ జిల్లా నుండి డప్పుల కళాకారులతో రథయాత్ర ప్రారంభించి డప్పుల ప్రదర్శనతో బొల్లారం వార్డు నెంబరు 8 ఆదర్శ నగర్‌లో అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులు అర్పించి అనంతరం ఆదర్శ్‌నగర్ బొల్లారం కంజర్ బజార్, మాదిగ బస్తీలలో కార్యక్రమానికి లక్షలాదిగా తరలిరావాలని పిలుపు ఇచ్చారు.

'గాంధీ'లో రేపటినుంచి సీపీఆర్‌పై శిక్షణ

అడ్డగుట్ట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటు వచ్చిన సమయంలో ఫస్ట్ ఎయిడ్ గా అత్యవసరంగా నిర్వహించే సీపీఆర్‌పై గాంధీ ఆలుమిని భవనంలో ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు గాంధీ మెడికల్ కాలేజీ అలుమినీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి తెలిపారు. శుక్రవారం గాంధీ ఆలుమినీ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, గాంధీలో మూడు రోజుల పాటు జరిగే సీపీఆర్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్లోబల్ అలయెన్స్ జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు సీపీఆర్ శిక్షణ క్యాంపులో 30 వేలకు పైగా వివిధ రంగాల్లో ఇప్పటి వరకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో వైద్యులు నర్సులు, ఆటో డ్రైవర్లు, పోలీసులు ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు 108 సిబ్బంది ఉన్నారన్నారు. ఛాతి భాగంలో సీపీఆర్ చేస్తే ప్రాణపాయం నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగితే చాలా మంది ప్రాణాల నుంచి బయట పడ్డారని ఆయన గుర్తు చేశారు. ఒక వేళ శిక్షణ అవసరం ఉన్న వాళ్లు 8179713704. 9063182058 నెంబరుకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని లింగమూర్తి కోరారు. మీడియా సమావేశంలో గ్లోబల్ అలుమిని ట్రస్ట్ ప్రతినిధులు వైద్యులు సురకంటి రవీందర్, కొలిపాక రాజశేఖర్, మహేశ్వర్ రెడ్డి, అమెరికా హార్ట్ అసోసియేషన్ ఇన్‌చార్జీ డాక్టర్ నేనీస్ మెకాలే (చికాగో) జనహిత సేవా ట్రస్ట్ నిర్వాహకులు నర్సింహమూర్తి పాల్గొన్నారు.

8వ వేతన సంఘం ఏర్పాటుపై హర్షం

చిలకలగూడ, జనవరి17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీత, భత్యాల సవరణకి 8వ వేతన సంఘం ఏర్పాటుపై రైల్వే ఉద్యోగులు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాల్లో ఏ ఇద్దరు ఉద్యోగులు కలిసినా వేతన సంఘం ఏర్పాటుపై చర్చించుకుంటున్నారు. గత పే కమీషన్‌లో ఎంత జీత భత్యాలు పెరిగాయి, 8వ వేతన సంఘంలో ఎంత వరకు పెరుగుతాయని క్యాంటీన్, ఆఫీస్, పార్కింగ్ ప్రదేశాల్లో ముచ్చటించుకుంటున్నారు. ఆరవ వేతన సంఘంలో మంచి జీతాలు పెరిగాయని గుర్తు చేసుకుంటున్నారు. జనవరి 1 2026 నుండి కొత్త వేతన సంఘం అమలు జరపాలి. ప్రతి పదేళ్లకి ఒకసారి వేతన సంఘం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీత, భత్యాలు, అలవెన్స్‌లు సవరిస్తుంటారు. గతంలో ఏర్పాటు చేసిన 7వ వేతన సంఘం గడువు డిసెంబర్ 31తో ముగుస్తుంది. ఉద్యోగులు, కార్మికులతో పాటు పెన్షనర్స్‌కి పెరిగే అవకాశం వుంది. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సంయుక్త కార్యదర్శి షేక్ రవూఫ్, మజ్దూర్ యూనియన్ అకౌంట్స్ బ్రాంచి కార్యదర్శి చింతకుంట రామకృష్ణ, ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి శ్రీధర్, పెన్షనర్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్, కార్మికులకి మెరుగైన జీత భత్యాలు, అలవెన్స్‌ల పెంపుకి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

ఇంకెంత దూరం..!



లాలాగూడ రైల్వే స్టేషన్

- ప్లాట్‌ఫాంపైకి వెళ్లాలంటే రెండు ఫ్లైఓవర్‌లు దాటాలి
- దారిలో ముళ్లకంపలు, ప్రయాణికుల పాట్లు
- మరుగుదొడ్లు లేవు.. తాగేందుకు నీళ్లు ఉండవు
- లాలాగూడ రైల్వే స్టేషన్‌లో అన్నీ సమస్యలే

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రెండు కిమీ దూరంలో ఉన్న లాలాగూడ రైల్వే స్టేషన్ ఇది. గత ఇరవై ఏళ్లుగా కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కనీసం తాగేందుకు నీటి కుళాయిలు లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. కనీస సౌకర్యాలులేని ఈ రైల్వేస్టేషన్‌లో కష్టాల మధ్య ప్రయాణాలు సాగిస్తున్నారు. లాలాగూడ రైల్వే స్టేషన్ నుంచి తెల్లవారుజాము రాత్రి 11 గంటల వరకు 33 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. పదిహేనేళ్లుగా ఈ స్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేవు.

> **రెండు పుట్ ఓవర్ బ్రిడ్జిలు దాటాల్సిందే**
>
> లాలాగూడ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నంబరు 1కు వెళ్లాలంటే ముళ్లకంపల నుంచి నడుస్తూ రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు దాటిన తరువాతే ఒకటవ, రెండవ ప్లాట్ ఫాంపైకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకే వృద్ధులు, వికలాంగులు స్టేషన్‌కు రావడంలేదు.

అడ్డగుట్ట, తుకారాంగేట్, ఈస్ట్‌మారేడుపల్లి, మెట్టుగూడ ప్రాంతాల వాసులు లాలాగూడ రైల్వే స్టేషన్ నుంచి మేడ్చల్, బొల్లారం వైపు వెళ్లాలంటే ఈస్టేషన్ మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. కానీ పరిష్కారానికి రైల్వే అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. కేవలం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మాత్రమే ఆకస్మిక తనిఖీల పేరుతో ఉత్తుత్తి తనిఖీలు చేస్తున్నారే తప్పా ఇలాంటి చిన్న చిన్న రైల్వే స్టేషన్‌లో ఏరోజున రైల్వే అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. రెండు ప్లాట్‌ఫామ్‌లు కలిగి ఉన్న ఈ స్టేషన్‌లో మంచినీళ్లు తాగేందుకు నీటి కుళాయిలు లేకపోవడం విడ్డూరంగా ఉందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ స్టేషన్‌లో రాత్రి 12 గంటల వరకు బుకింగ్ కార్యాలయం తెరిచి ఉండాల్సి ఉండగా సాయంత్రం 5కే కౌంటర్‌ను మూసివేస్తున్నారు. దాంతో ప్రయాణికులు టికెట్ లేకుండా రైళ్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.

స్టేషన్‌లో అసాంఘిక కార్యకలాపాలు

రాత్రి 8 గంటలు అయిందంటే చాలు ప్లాట్‌ఫాంపైనే మద్యం ప్రియులు ఫుల్లుగా తాగి ప్రయాణికులను ఇబ్బందులు పెడుతున్నారు. రాత్రి 12 గంటల వరకు ఈ రైల్వే స్టేషన్‌లో పేకాట ఆడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రైల్వే ఆర్పీఎఫ్ పోలీసుల తనిఖీలు లేకపోవడంతో వారు రెచ్చిపోతున్నారు. న్యూ బ్రిడ్జి నుంచి తుకారాంగేట్ వైపు వచ్చే ప్రయాణికులను రాత్రి సమయంలో కత్తులు చూపి బెదిరించి డబ్బులు కాజేస్తున్నారు.

ఉపయోగంలేని మరుగుదొడ్లు

లాలాగూడ రైల్వే స్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేవు. కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. స్టేషన్ ఆవరణలోని బుకింగ్ కౌంటర్ పక్కనే రెండు మరుగుదొడ్లు ఉపయోగంలో లేకపోవడంతో ప్రయాణికులు రైళ్లలోనే కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

రాత్రిపూట గస్తీ లేదు



లాలాగూడ రైల్వే స్టేషన్ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. రాత్రిపూట గస్తీ నిర్వహించకపోవడంతో చీకటి పడిందంటే చాలు తాగుబోతుల వీరంగం, వ్యభిచారులు పేట్రేగిపోతున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇక్కడ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. అనేకసార్లు ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు.

- రామలీల, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, అడ్డగుట్ట

తాగేందుకు నీళ్లు ఉండవు



లాలాగూడ రైల్వే స్టేషన్‌లో జీఎం పర్యటించాలి. రైల్వే జీఎంకు కూత వేటు దూరంలో ఉన్న ఈ స్టేషన్ ప్రస్తుతం కనీస సౌకర్యాలు లేక దీనావస్థలో ఉంది. తాగేందుకు నీళ్లు ఉండవు. కాలకృత్యాలకు మరుగుదొడ్లు లేవు. స్టేషన్‌కు వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు పడాల్సివస్తోంది.

- శివకుమార్, శాంతినగర్

ప్రారంభంకాని బుకింగ్ కార్యాలయం

లాలాగూడ రైల్వే స్టేషన్ రెండవ ప్లాట్ ఫాం వైపు ఐదేళ్ల క్రితం బుకింగ్ కార్యాలయాన్ని నిర్మించినా, ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. ఇంకా నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు తప్పని పరిస్థితిలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఆశ్రయించాల్సిందే. ఫుట్ ఓవర్ బ్రిడ్జి దాటి వెళ్లాలంటే ఈలోగా రైలు వెళ్లిపోతుంది. ఇలా లాలాగూడ రైల్వే స్టేషన్‌లో అనేక సమస్యల మధ్య రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ఎక్కడైనా సరే రైళ్లు వస్తున్న సమయంలో మైకులో అనౌన్స్ చేస్తారు.. కానీ ఈ స్టేషన్‌లో రైళ్లు వస్తున్న సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మైకులో అనౌన్స్ చేస్తుంటారు. లాలాగూడ రైల్వే స్టేషన్‌లో అనౌన్స్‌మెంట్ టెక్నాలజీ లేకపోవడంతో ప్రయాణికులు తికమకపడుతున్నారు.

రెచ్చగొట్టే మాటలు నమ్మవద్దు: ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్‌పల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరుగుతోందని అందులో భాగంగానే కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చడానికి ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా భూముల సేకరణకు సంబంధించి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో చిన్నతోకట్ట కమ్యూనిటీహాలులో స్థానికులతో శుక్రవారం ఏర్పాటుచేసిన గ్రామ సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.



బోయిన్‌పల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూములు కోల్పోతున్న బాధితులతో ఆయన మాట్లాడారు. చట్టప్రకారమే అందరికీ నష్టపరిహారం అందజేస్తామని అన్నారు. సంతృప్తికర స్థాయిలో నష్టపరిహారం ఇప్పించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. భూసేకరణలో ఎక్కడైనా ఆలయాల భూమి సేకరించాల్సి వస్తే అక్కడ కూడా భక్తులు, ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పోచంపల్లి శ్రీనివాస్

అడ్డగుట్ట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నియోజక వర్గంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. గ్రేటర్ గ్రంథాలయ శాఖ డైరెక్టర్ పోచంపల్లి శ్రీనివాస్ శుక్రవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆయన నివాసంలో ఛైర్మన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

సికింద్రాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం అన్నానగర్‌కు చెందిన శ్రీమతి వర్ధోలు కాలమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎమ్మెల్యేను సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.5లక్షల (ఎల్ఓసీ) పత్రాలను వారి కుటుంబసభ్యులకు అందించారు.

గాంధీ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం.. వృద్ధుడి మృతి

అడ్డగుట్ట, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. ఆస్పత్రి సిబ్బంది కేస్ షీట్ పోగొట్టడంతో చికిత్స అందడంలో జాప్యం జరిగి ఆయన మృత్యువాత పడ్డారు. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం సమీపంలో చేర్యాల్ గ్రామానికి చెందిన ఇప్పల యాదగిరి (72) మిధాని ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. ఆయన గురువారం అనారోగ్యానికి గురవ్వడంతో మధ్యాహ్నం గాంధీ ఆస్పత్రిలో క్యాజువాలిటీ వార్డులో చేర్పించారు. ప్రాథమిక వైద్యం చేసిన వార్డు వైద్యులు యాదగిరిని 3వ అంతస్తులోని అత్యవసర విభాగంలో అడ్మిట్ చేయాలని సిఫార్సు చేశారు. తీరా అక్కడికి వెళితే బెడ్లు లేవని మళ్లీ క్యాజువాలిటీ వార్డుకు పంపించారు. అయితే అతనికి సంబంధించిన కేస్ షీట్‌ను సిబ్బంది ఎక్కడో పెట్టి మరచిపోయారు. రాత్రి 8 గంటలకు డ్యూటీ సిబ్బంది మారారు. యాదగిరికి సంబంధించిన కేస్‌షీట్ గురించి యాదగిరి కుటుంబ సభ్యుల్ని ఆ సిబ్బంది ప్రశ్నించారు. కేస్ షీట్ తమకు ఇవ్వలేదని, మీ దగ్గరే ఉందని చెప్పినా సిబ్బంది వినిపించుకోలేదు. కేస్‌షీట్ లేనిదే వైద్యం చేయలేమంటూ రాత్రి 11.45 గంటల వరకు వైద్యం చేయకుండానే యాదగిరిని క్యాజువాలిటీ వార్డులో ఉంచి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. చివరికి కుటుంబసభ్యులు రాత్రి 12 గంటలకు కొత్త కేస్ షీట్ తీసుకురాగా యాదగిరిని మళ్లీ 3వ అంతస్తులోని ఐసీయూ విభాగానికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున 3 గంట సమయంలో యాదగిరి మృతి చెందారు. కేస్ షీట్ మాయం కావడం, క్యాజువాలిటీ సిబ్బంది వైద్యం చేయడంలో నిర్లక్ష్యం చేసినందునే యాదగిరి చనిపోయారని ఆయన కుటుంబసభ్యులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గాంధీలో చికిత్స పొందుతూ మరణించిన యాదగిరి, ఇన్‌సెట్‌లో (ఫైల్ ఫొటో)



రైల్వే కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైల్వే కార్మికులు

ఇంజనీరింగ్ కార్మికుల ధర్నా

పద్మారావునగర్, జనవరి17(ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకరరావు సూచనలతో శుక్రవారం ఉదయం సికింద్రాబాద్, బోయగూడ రైల్ కళారంగ్ సమీపంలోని రైల్వే ఇంజనీరింగ్ కార్యాలయం ఎదురుగా కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. రైల్వే ట్రాక్ మెన్ ఇంజనీరింగ్ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైల్వేలోని అన్ని ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, రైల్వే ఉన్నతాధికారులకు యూనియన్ నాయకుల ద్వారా వినతి పత్రం అందజేశామని వారు తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులు 24న డివిజన్ లెవెల్లో, ఫిబ్రవరి 5న జీఎం కార్యాలయం ఎదురుగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు..

సామరస్యంగా పరిష్కరించుకోవాలి

మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్

రెజిమెంటల్ బజార్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని గొడవలు దిగి దాడులు చేసుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. శుక్రవారం సెకండ్‌బజార్‌లో గోడ విషయంలో రెండు కుటుంబాలు గొడవపడుతూ డయల్ 100 కు కాల్ చేశారు. వెంటనే మార్కెట్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఇరు కుటుంబాలకు నచ్చజెప్పారు. సివిల్ వివాదం ఉంటే కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోవాలని గొడవలకు దిగొద్దని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ

తిరుమలగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాహుల్ హెగ్డే డీసీపీ, ఏసీపీలు తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాలన్నీ చూశారు. పోలీస్ స్టేషన్ ముందు ఉన్న సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. వాహనదారులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ సాఫీగా వెళ్ళేలా విధులు నిర్వహించాలని సూచించారు.




తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డీసీపీ రాహుల్ హెగ్డే

రోడ్డు భద్రతా వారోత్సవాలు..

రాంగోపాల్‌పేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా మహంకాళి ట్రాఫిక్ ఇనిస్పెక్టర్ ఉపశంకర్, ఎస్సైలు ఇతర సిబ్బంది. రాణిగంజ్, ప్యాట్నీలలో ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి అవగాహన కల్పించారు.

తిరుమలగిరి జనవరి 17 (ఆంధ్రజ్యోతి):తిరుమలగిరి ఆర్టీఏ అధికారి మట్టం ఎర్రిస్వామి ఆధ్వర్యంలో ఈ నెల 31వ తారీకు వరకు జరిగే రోడ్డు భద్రతా ఉత్సవాల కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కార్యాలయంలో అధికార సిబ్బందితో కలిసి వినియోగదారులకు కరపత్రాలు అందజేసి రోడ్డు భద్రతలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

సర్కార్ మ్యాజిక్ షో మరో రెండు రోజులే





హరిహరకళాభవన్, జనవరి17(ఆంధ్రజ్యోతి): పీసీ సర్కార్ మ్యాజిక్ షో మరో రెండు రోజులు మాత్రమే ఉంటుందని నిర్వాహకుడు కార్తికేయన్ తెలిపారు. సికింద్రాబాద్, హరిహర కళాభవన్‌లో జనవరి 4వ తేదీన మొదలై ప్రతి శని, ఆదివారాల్లో రెండు షోలతో సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక షోలు నిర్వహించారు. శని, ఆదివారాల్లో సాయంత్రం 4, 7గంటలకి పాఠశాల విద్యార్థులకి టికెట్ ధరలో తగ్గింపుతో ఐడెంటిటీ కార్డుతో పొందవచ్చునని తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత కారణాల కారణంగా ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొండమడుగు గ్రామ శివారులో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్ రావు వివరాల ప్రకారం.. ఖాజీ ఖబర్ ప్రాంతానికి చెందిన అనిల్ కుమార్ (45) శుక్రవారం తన సైకిల్‌పై ఔషాపూర్- కొండమడుగు రైల్వే స్టేషన్ దగ్గరికి వచ్చి పట్టాల వద్ద సైకిల్ ఉంచి గుంటూరు వైపు వెళ్లే ఇంటర్‌సిటీ రైలుకు ఎదురుగా పట్టాల మధ్య పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు డ్రైవర్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి జేబులో దొరికిన అడ్రస్ ప్రకారం రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యం



రాంచరణ్ (ఫైల్‌ఫొటో)


బోయిన్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కంసారిబజార్‌కు చెందిన గోసు రాంచరణ్ అనే బాలుడు అదృశ్యమైనట్లు బోయిన్‌పల్లి ఎస్ఐ శివశంకర్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చి, స్నేహితులతో బయట ఆడుకోవడానికి వెళ్లిన తమ కుమారుడు రెండు రోజులుగా తిరిగి రాలేదు. కుమారుడి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిలకలగూడలో...



లోకేష్ (ఫైల్)

బౌద్ధనగర్, జనవరి17(ఆంధ్రజ్యోతి): ఇంటి నుండి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ వివరాల ప్రకారం.. మెట్టుగూడకు చెందిన ఎర్ర లోకేష్(30) నగరంలో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈనెల 16న బయటకు వెళ్లిన లోకేష్ ఇంటికి చేరుకోలేదు. భార్య ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావటంతో పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. దీంతో తన భర్త కనిపించటం లేదని శుక్రవారం భార్య చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



టెన్నిస్ ఆడుతున్న ఐజీ రమేష్

హైదరాబాద్ టెన్నిస్ టోర్నీ షురూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సికింద్రాబాద్ క్లబ్ టెన్నిస్ కాంప్లెక్స్‌లో పోలీసు అధికారి ఐజీ ఎం.రమేష్ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దైనందిన జీవనంలో క్రీడలను భాగం చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. మూడ్రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 220 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు రూ2 లక్షల నగదు బహుమతి ప్రదానం చేయనున్నామని హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సమాఖ్య అధ్యక్షుడు నంద్యాల నరసింహారెడ్డి వెల్లడించారు.

నేటి నుంచి రైల్వే సీనియర్ సిటిజన్స్ ఆటల పోటీలు

చిలకలగూడ, జనవరి17(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ డే కేర్ సెంటర్ ఆధ్వర్యంలో సభ్యులకి ఆటల పోటీలు నిర్వహించి అన్ని ఏర్పాట్లు గావించినట్లు కార్యదర్శి ఆర్.నరసింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలగూడ, ఫెడరేషన్ కార్యాలయంలో శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజులు క్యారమ్స్(డబుల్స్), చెస్, తంబోలాలో పోటీలు నిర్వహించి గణతంత్ర దినోత్సవంన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.